

రేపు ఐటీఐలో అప్రెంటిస్ మేళా

శామీర్‌పేట, నవంబర్ 9 (ఆంధ్రజ్యోతి) : శామీర్‌పేటలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో ఈనెల 11న ఉదయం 9.30 గంటలకు ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్ షిప్ మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లలిత తెలిపారు. హెచ్‌బీఎల్, బీఈఎల్, ఎన్ఎఫ్‌సీ, ఫెనెస్టా, తదితర కంపెనీల ప్రతినిధులు మేళాలో పాల్గొనున్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వెల్లడించారు.

కార్తీక మొక్కులు

కీసర రామలింగేశ్వరుడిని దర్శించుకున్న భక్తులు

కార్తీక దీపాలు వెలిగించి మొక్కుకున్న మహిళలు

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సత్యనారాయణ వ్రతాలు



కీసరగుట్టలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కీసర, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం, వీకెండ్ కావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తుతున్నారు. కీసరగుట్టలో భక్తుల సందడి నెలకొంది. భక్తులు గర్భాలయంలోని మూలవిరాట్‌ను దర్శించుకున్నారు. ఆలయ వామభాగంలోని లక్ష్మీనరసింహస్వామి, శివపంచాయతనం, సీతారామచంద్రస్వాములను దర్శించుకున్నారు. ఆనంతరం ఆలయ ప్రాంగణంలోని శివలింగాలకు అభిషేకాలు, పూజలు చేశారు. కార్తీక దీపాలు వెలిగించి తమ మొక్కులు తీర్చుకున్నారు. చీర్యాల్ శ్రీ చీర్యాల లక్ష్మీ నరసింహ్మస్వామి ఆలయంలో భక్తులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. రద్దీ దృష్ట్యా ప్రభుత్వం ఆలయం వరకు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసింది. కీసర ఆర్‌డీవో సైదులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయగా, ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీ నారాయణ ఆయనకు స్వామి వారి జ్ఞాపికను అందజేసి సత్కరించారు.



సత్యనారాయణ వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు



బీరప్ప పండగ సందర్భంగా ఎల్లమ్మ కథ చెబుతున్న కళాకారులు (ఫైల్)

పాశ్చాత్య సంస్కృతి విస్తరిస్తున్న ఈ రోజుల్లోనూ ఒగ్గు కథలకు ఏ మాత్రం ఆదరణ తగ్గలేదు. ఒగ్గు కథ చెబుతున్నారని తెలిస్తే చాలు జనం తండోపతండాలుగా వచ్చి ఆసక్తిగా వింటారు. శుభ, అశుభ కార్యాలలోనూ ఒగ్గు కథలను చెప్పిస్తుంటారు. ఈ కథలను వినేందుకు మారుమూల గ్రామాల జనంతో పాటు నగర వాసులు కూడా ఆసక్తి కనబరుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో చాలా గ్రామాలలో ఒగ్గు కళాకారులు కథలు చెబుతూ తమకున్న ఎకరం, అర ఎకరం భూమిలో సాగు చేసుకుంటూ జీవితాన్ని సాగిస్తున్నారు.

డిల్లెం.. బల్లెం

వన్నె తగ్గని ఒగ్గుకథ

Sunday Special

- పాశ్చాత్య సంస్కృతిలోనూ తగ్గని ప్రాచుర్యం
- కళాకారులకు మాత్రం ఆదరణ కరువు
- వారం పాటు మల్లన్న, బీరప్ప పండగలు
- కథలు చెప్తూ జీవనం సాగిస్తున్న ఒగ్గు కళాకారులు

యాచారం నవంబరు 9 : కాలక్షేపం కోసం నేటికీ చాలా మంది ఒగ్గుకథలు వింటూ ఆనందాన్ని పొందుతున్నారనడంలో అనుమానం లేదు. ఒగ్గు, డోలు, జగ్గు(ఢమరుకం) శివుని ప్రతిరూపాలుగా అభివర్ణిస్తారు. తెలంగాణ రాష్ట్ర చరిత్ర, సంస్కృతిని చాటి చెప్పే విధంగా ఒగ్గు కథలు చెబుతారు. ఆ కళాకారులు చేసే కత్తుల విన్యాసాలు ఎంతో ఆకట్టుకుంటాయి. మాందాత, బీరప్ప, మల్లన్న, రేణుకాఎల్లమ్మ కథలు ఎక్కువగా చెబుతుంటారు. మల్లన్న కథలో బండ రాళ్లున్న భూమిని దున్ని పంటలు సాగు చేయగా అన్నలే ధాన్యం చోరీ చేస్తున్న విధానం చెబుతున్నప్పుడు, ఎల్లమ్మ కథలో తండ్రి జాడ చెప్పమని ఎల్లమ్మను ఆమె కుమారుడు పరుశురాముడు తల్లిని అగ్నిగుండంలో వేయడం, చెల్లెలు సిరియాళ గౌరమ్మను

మిగతా 7వ పేజీలో...



35 ఏళ్లక్రితం బీరప్ప పండగ సమయంలో ఒగ్గుకథ చెబుతున్న జమ్మ మల్లారి

జిల్లాలో నేడు

అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ప్రారంభం

తాండూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తాండూరులో అదనపు సివిల్ జడ్జి కమ్ అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టును ఆదివారం హైకోర్టు జడ్జి జస్టిస్ నగేష్ బీమపాల్, వికారాబాద్ జిల్లాసేషన్ జడ్జి సున్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించనున్నట్లు తాండూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అగ్గనూరు శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 11.46 నిమిషాలకు జరిగే ఈ కార్యక్రమానికి తాండూరు ప్రాంత న్యాయవాదులతో పాటు జిల్లాలోని న్యాయవాదులందరూ హాజరు కావాలని కోరారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఏడీఏ చంద్రకళ

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

కీసర, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ శనివారం కీసరలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఏ గ్రేడ్ కు రూ. 2,320 చెల్లిస్తుందన్నారు. అదే విధంగా సన్న రకానికి ప్రభుత్వం మద్దతు ధరతో పాటు బోనస్ 500 రూపాయాలు చెల్లిసుందన్నారు. ఈ మేరకు రైతులు వడ్లను తాలు, చెత్త లేకుండా తేమ 17శాతం ఉండే విధంగా జాగ్రత్తలు పాటించాలని ఆమె సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

పరిగి పట్టణమంతా అండర్ డ్రైనేజీ

పరిగి,నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పరిగి పట్టణమంతా అండర్ డ్రైనేజీని నిర్మిస్తామని పరిగి మునిసిపల్ చైర్మన్ అశోక్ అన్నారు. శనివారం మునిసిపల్ పరిధిలోని రెండవవార్డులో అండర్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని వార్డుల్లో పార్టీలకతీతంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. తాగునీరు, వీధిదీపాల పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య, మేనేజర్ నరేష్, అధికారులు దశరథ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

7,771

- 18వ తేదీ వరకు కొనసాగనున్న సమగ్ర సర్వే
- పకడ్బందీగా నిర్వహించాలి
- కలెక్టర్ ప్రతీక్‌జైన్

తొలిరోజు కుటుంబాల సమాచారం సేకరణ

వికారాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ప్రతి కుటుంబానికి సంబంధించి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల తదితర అంశాల సమాచారం సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వికారాబాద్ జిల్లాలో ప్రారంభమైంది. ఇంటింటి సర్వే ప్రారంభించిన తొలిరోజు శనివారం జిల్లా వ్యాప్తంగా 7,771 కుటుంబాల సమాచారం సేకరించారు. మొదట సర్వేలో పేర్కొన్న ప్రశ్నల్లో కొన్ని మార్పులు, చేర్పులు చేశారు. దీని ప్రకారమే ఒక్కో కుటుంబం నుంచి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల తదితర అంశాలకు సంబంధించిన సమాచారం సేకరిస్తున్నారు. మొదటి రోజు ఒక్కో కుటుంబం సమాచారం సేకరించేందుకు 45 నిమిషాల నుంచి గంట వరకు సమయం పట్టిందని ఎన్యూమరేటర్లు చెబుతున్నారు. కాగా ఈనెల 6 ప్రారంభం కాగా, 8వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి ఇంట్లో కుటుంబ యజమానితో పాటు ఎంత మంది సభ్యులు ఉంటున్నారనే వివరాలు తెలుసుకుని స్టిక్కర్లు అతికించిన విషయం తెలిసిందే. కాగా, ఒక్కో ఇంట్లో కుటుంబ యజమానితో పాటు నివసించే వారి వివరాలు, వారికి సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకునే ప్రక్రియ శనివారం జిల్లాలో ప్రారంభమైంది. 9న ప్రారంభమైన ఈ సర్వే 18వ తేదీ వరకు 13 రోజుల పాటు కొనసాగనుంది. జిల్లాలో 4 మునిసిపాలిటీలు, 20 మండలాల పరిధిలో 2,63,362 కుటుంబాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు సర్వే ముగిసిన తరువాత 19 నుంచి 27వ తేదీ వరకు 9 రోజుల పాటు సర్వే ఫారాల్లో నమోదు చేసిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు.

పకడ్బందీగా చేయాలి: కలెక్టర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎలాంటి పొరపాట్లు లేకుండా

మిగతా 8వ పేజీలో...

నడిరోడ్డుపై..

బీటీ వేశారు.. స్తంభాలు తీయడం మరిచారు

- రాత్రి వేళల్లో ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రోడ్లను అభివృద్ధి చేసి రవాణ వ్యవస్థను మెరుగు పరుచడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టినా అది క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. రోడ్ల మరమ్మతులు అనుకున్నంత స్థాయిలో జరగడం లేదు. అధికారుల పర్యవేక్షణా లోపం గుత్తెదా రుల నిర్లక్ష్యంతో రోడ్ల పనుల్లో జాప్యం జరుగుతోంది. దీంతో నిత్యం ప్రమాదాలు జరిగి అమాయకులు తమ ప్రాణాలను పొగొట్టుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం సీఎఫ్‌అర్ (సెంట్రల్ రోడ్ ఫండ్)కింద నారపల్లి నుంచి ఎదులాబాద్ లోని రంగనాయకస్వామి ఆలయం వరకు రోడ్డు మరమ్మలు, విస్తరణకు రూ. 15కోట్లు మంజూరు చేసింది. 10 కిలోమీటర్ల దూరం వరకు పనులు చేపట్టారు. పనులు ప్రారంభమై రెండెళ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదు. అర్ అండ్ బీ, ఇరిగేషన్ అధికారుల

మిగతా 8వ పేజీలో...

త్వరలో విద్యుత్ స్తంభాలను తీయిస్తాం

నారపల్లి-ఎదులాబాద్ రోడ్డు మరమతుల నిర్మాణ పనులు పూర్తికావోచ్చాయి. ఎదులాబాద్ సమీపంలో రోడ్డుపై ఉన్న స్తంభాలను తీయాలని విద్యుత్ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేశాం. నారపల్లిలో రోడ్డుపై ఉన్న స్తంభాలను పక్కకు తొలగించాము. ఎదులాబాద్ వైపు ఉన్న స్తంభాలను త్వరలో తొలగించి, ఈనెలఖరు వరకు రోడ్డు పనులు పూర్తిచేస్తాం

- రంజిత్, అర్‌అండ్‌బీ ఏఈ



మాదిరెడ్డిపల్లిలో సర్వేను అడ్డుకుంటున్న రైతులు

భూములు ఇచ్చేది లేదు

- రింగ్ రైల్ సర్వేను అడ్డుకున్న రైతులు

నవాబుపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రింగ్ రైల్ నిర్మాణానికి భూములు ఇచ్చేది లేదంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రీజినల్‌రింగ్ రోడ్డుకు సమాంతరంగా రింగ్ రైల్ నిర్మాణ సర్వేను శనివారం నవాబుపేట మండలంలోని మాదిరెడ్డిపల్లి గ్రామ రైతులు అడ్డుకున్నారు. పట్టాభూముల్లో నుంచి రింగ్ రోడ్డు అంటూ ఒకరు, రింగ్ రైల్ సర్వే అంటూ మరొకరు చెప్పడం సరైంది కాదన్నారు. ఉన్న భూమిని ఇచ్చి తాము బతికేదెట్లా అని మండిపడ్డారు. భూమికి భూమి, పరిహారంపై స్పష్టమైన హామీని అధికారులు ఇచ్చేంత వరకు సర్వే చేయనివ్వమని తేల్చి చెప్పారు. ఈ సర్వేతో దాదాపు 400 మంది రైతులు తమ పట్టా భూములను కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చేసేది లేక సర్వే సిబ్బంది వెనుదిరిగారు.

డబ్బుతో రాజకీయాలు కొనసాగించలేం

- సభ్యత్వ నమోదులో మేడ్చల్ జిల్లా ప్రథమ స్థానం : ఈటల



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కీసర, నవంబరు9(ఆంధ్రజ్యోతి) డబ్బులతో ఎప్పటికీ రాజకీయాలు కొనసాగించలేమని మాల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు.శనివారం కీసరలోని మేఘన కన్వెక్షన్‌లో మేడ్చల్‌జిల్లా అధ్యక్షుడు పటోళ్లవిక్రమ్‌రెడ్డి, జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉప్పునూతల మురళీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో సంస్థాగత ఎన్నికల కార్యశాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పార్టీ అధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో మేడ్చల్ జిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. మేడ్చల్‌లో త్వరలో ప్రతి బూత్‌కి బూత్ కమీటీ ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. కష్టపడే వారికే మండల అధ్యక్ష పదవులు దక్కుతాయన్నారు. మండల స్థాయి నాయకులను రాష్ట్ర స్థాయిలోకి తీసుకునే అవకాశం ఉందన్నారు. పార్టీ పిలుపునిస్తే ప్రతి కార్యకర్త సమావేశాలకు హాజరు కావాలన్నారు. త్వరల్లో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతాయని, పార్టీ ఆదేశాల మేరకు డబ్బు రాజకీయాలను పోగొట్టగల శక్తి కావాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వేను సక్రమంగా నిర్వహించాలి

జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా



సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

కీసర రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. ఆమె దమ్మాయిగూడలో శనివారం పర్యటించి, సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ ఇంటింటికి వెళ్లి పూర్తి వివరాలు సేకరించాలన్నారు. ఏఒక్క కుటుంబ సమాచారం తప్పిపోకుండా చూడాలని ఆదేశించారు. వివరాలకు ప్రజలను ఇబ్బంది పెటొద్దన్నారు. స్వచ్ఛందంగా ఇచ్చిన సమాచారాన్ని నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నాగమణి, మేనేజర్ వెంకటేశం, సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రభ, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నాగారం మున్సిపాలిటీ పరిధిలో సమగ్ర కుటుంబ సర్వే తీరును మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, కమిషనర్ భాస్కర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఏయే వివరాలు సేకరిస్తున్నారని ఎన్యుమరేటర్లను అడిగి తెలుసుకున్నారు.

ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ ఇస్మాయిల్‌కాన్‌గూడలో సమగ్ర కుటుంబ సర్వే వివరాలను అదనపు కలెక్టర్ రాధిక గుప్త శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఇస్మాయిల్‌గూడలోని చెరుకు సంధ్యాబాల్‌రాజ్ ఇంటి వద్ద నిర్వహించిన సర్వేను (వివరాల నమోదును) పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కొండల్‌రెడ్డి, కమిషనర్ వీరారెడ్డి, కౌన్సిలర్ మహేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు నమోదు చేయించుకోవాలి



ఓటరు నమోదును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

బొంరాస్‌పేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓటరు నమోదు కోసం శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదును అర్హులు వినియోగించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. బొంరాస్‌పేట్ మండలంలోని తుంకిమెట్ల గ్రామంలో 194, 195 పోలింగ్ కేంద్రాల్లో జరిగిన ఓటరు నమోదు కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు నూతన ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్, మోహన్‌రెడ్డి, అంజిరెడ్డి, గోవర్ధన్, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజూ ఏరియల్ సర్వే

చౌదరిగూడ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఆర్‌ఆర్‌కు సమాంతరంగా కొందుర్గు మండలంలో రింగ్ రైల్వే నిర్మాణం కోసం చేపట్టిన ఏరియల్ సర్వే శనివారం కూడా కొనసాగింది. రేగడి చిల్కమర్రి, శివారులో రెండు నెలల క్రితం ట్రిబుల్‌ఆర్‌కు వేసిన మార్కింగ్ ఆధారంగా ఆర్వీ అసోషియేషన్ ప్రతినిధులు హెలీకాప్టర్ సహాయంతో సర్వే చేశారు. ఇందులో భాగంగా బాలనగర్ మండలం నుంచి ఏరియల్ సర్వేను ప్రారంభించి కొందుర్గు మీదుగా పరిగి వైపు ల్యాండ్ మార్కింగ్ చేశారు.



ఏరియల్ సర్వేను ఆసక్తిగా చూస్తున్న గ్రామస్తులు. చిత్రంలో హెలీకాప్టర్

మహిళల భద్రతే షీ టీం లక్ష్యం



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న షీటీం పీసీవో రేష్మ

షాబాద్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతతే షీటీం లక్ష్యమని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని చేవెళ్ల షీటీమ్ పీసీవో రేష్మ తెలిపారు. శనివారం షాబాద్‌లోని మాంటిస్సోరి హైస్కూల్‌లో మహిళల భద్రతపై విద్యార్థినులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలను ఎవరైనా వేధిస్తే చర్యలు తప్పవన్నారు. మహిళలు, విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తే వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. అదేవిధంగా బాల్య వివాహాలు, సైబర్‌క్రైం, ఆన్‌లైన్ మోసాలు, ట్రాఫిక్ చట్టాలు, భరోసా సెంటర్, ఆపరేషన్ స్మైల్, విద్యార్థినిలకు భద్రతపై అవగాహన కల్పించారు. కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గో ఆధారిత ఉత్పత్తులను వాడాలి



గోపూజలో పాల్గొన్న గోరక్షకులు

మహేశ్వరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గోఆధారిత వ్యవసాయంతో పాటు గోవు ఉత్పత్తులను ప్రతీఒక్కరు విధిగా వాడి ఆరోగ్యాలను కాపాడుకోవాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండలంలోని గట్టుపల్లి హనుమాన్ దేవాలయంలో గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ హిందూ దేవాలయాలపై దాడులు అధికమవుతున్నాయని, వాటిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. గోవులను అక్రమంగా కబేళాలకు తరలిస్తున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గోరక్షకులు రాజు, సిద్ధు, రాఘవేందర్, శివ, ఈశ్వర్, మహేష్, శ్రీను, రాజేష్, శ్రీశైలం, నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహా పడిపూజ





పూజలో అయ్యప్ప స్వాములు

చేవెళ్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పట్టణ కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని శనివారం మహా పడి పూజ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక పూజలు చేయడంతోపాటు స్వామివారి 18 మెట్లకు అన్నిరకాల పూలు, పండ్లతో పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వాములు అయ్యప్ప పాటలు పాడారు. ఆలయ ప్రాంగణం స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు కిరణ్‌కుమార్, అయ్యప్ప మాలధరణ గురుస్వాములు, స్వాములు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



ఇబ్రహీంపట్నం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని ఎలిమినేడు పశు వైద్యాధికారి వై.ఆనందరెడ్డి రైతులకు సూచించారు. శనివారం తుర్కగూడలో గాలికుంటు టీకాలు వేశారు. పాడిగేదెలు, ఆవుల్లో గాలికుంటు వ్యాధి సోకితే పాల దిగుబడులు గణనీయంగా తగ్గుతాయన్నారు. పశువులు చనిపోయే ప్రమాదముంటుందని, పశువుల్లో పునరుత్పత్తి సామర్థం కూడా తగ్గుతుందన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



ఆర్థికసాయం అందజేస్తున్న జైపాల్‌యాదవ్

ఆమనగల్లు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అధైర్య పడొద్దు అండగా ఉంటామని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. పేద కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. శనివారం మార్చాల గ్రామంలో జైపాల్‌యాదవ్ పర్యటించారు. అనారోగ్యంతో మృతి చెందిన సాయమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి వ్యక్తిగతంగా రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు విజయ్‌గౌడ్, సూర్యప్రకాశ్‌రావు, పుల్లారెడ్డి, బాలయ్య, వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య, మల్లేశ్, శ్రీశైలం, రాంరెడ్డి, లింగం, నరేశ్, నిజామొద్దీన్, తదితరులు ఉన్నారు.

గుండ్లపోచంపల్లిలో ఆగని అక్రమాలు



అనుమతులు లేకుండా నిర్మిస్తున్న గెస్ట్ హౌజ్

- అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారిన వైనం
- అధికారుల ఉదాసీనత
- కోట్లలో మున్సిపాలిటీ ఆదాయానికి గండి
- ఫిర్యాదు అందేవరకూ కన్నెత్తి చూడని అధికారులు

మేడ్చల్ టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ అక్రమ కట్టడాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. మున్సిపల్ పరిధిలోని స్థలాలు హైరేంజ్ జోన్‌లో ఉండటంతో ఇక్కడ దశాబ్ద కాలంగా వెంచర్లు, బహుళ అంతస్తులు, గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు పెద్దఎత్తున వెలిశాయి. అక్రమ నిర్మాణాలకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండలు ఉండటంతో ఈ వ్యవహారం నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. ఈవిషయమై కొందరు కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఫలితంగా కమర్షియల్, రెసిడెన్షియల్ అక్రమకట్టడాలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. మున్సిపల్ పరిధిలోని బాసిరగడి, జ్ఞానాపూర్, మైసమ్మగూడ, కండ్లకోయ, మునీరాబాద్, ప్రాంతాల్లో ఇప్పటికే బఫర్, ఎఫ్‌టీఎల్ జోన్‌లలో పెద్దఎత్తున అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఇటీవల మున్సిపల్ పరిధిలోని సర్వేనెంబర్ 506, 507లోని దారనికుంట కంజర్ వేషన్, బఫర్ జోన్‌లో ఓ బడానేత ఎలాంటి అనుమతులు లేకుండా 2వేల చదరపుగజాల్లో పెద్దఎత్తున గెస్ట్‌హౌజ్ నిర్మిస్తుండగా స్థానికులు ఫిర్యాదు చేయగా మున్సిపల్ అధికారులు మాత్రం కంటి తుడుపు చర్యగా పనులను నిలిపివేశారు.

విల్లాల్లో అక్రమ నిర్మాణాలు



మున్సిపల్ పరిధిలో దాదాపు 15సంవత్సరాల కిందట గేటెడ్ కమ్యూనిటీల్లో భారీఎత్తున విల్లాలను నిర్మించారు. అవి పాతబడటంతో మున్సిపాలిటీ అనుమతులు లేకుండానే విల్లాలను కూల్చివేసి వాటి స్థానంలో కోట్ల రూపాయలు వెచ్చించి కొత్త హంగులతో భవనాలను నిర్మించుకుంటున్నారు. మరికొందరు రెనోవేషన్ పేరిట అదనపు నిర్మాణాలు చేపడుతున్నారు. మున్సిపల్ పరిధిలోని పామిడోస్, నైబర్ హుడ్ విల్లాలో పెద్దఎత్తున నిబంధనలకు విరుద్దంగా నిర్మాణాలు చేపట్టినట్లు సమాచారం. వీటి యజమానులు సంపన్నులు, రాజకీయ నాయకులు, బడా వ్యాపార వేత్తలు ఉండటంతో వీరి వద్దకు వెళ్లి నిర్మాణాలను అడ్డుకోలేని పరిస్థితిలో మున్సిపల్ అధికారులు ఉన్నారంటూ కొందరు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు కండ్లకోయ ప్రాంతంలో విద్యార్థుల హాస్టళ్ల కోసం కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా నాలుగంతస్తుల భవనాలను కట్టిన దాఖలాలు ఉన్నాయి.

అక్రమార్కులకు ఆసరాగా ట్యాక్స్ ఫిక్సేషన్

మున్సిపల్ పరిధిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన భవనాలకు వార్షిక ట్యాక్స్‌ఫిక్స్ చేసి మున్సిపల్‌కు ఆదాయం పెంచుకోవాలన్న కౌన్సిల్ ప్రతిపాదనను అక్రమ నిర్మాణాలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే గుండ్లపోచంపల్లిలో వెలసిన అక్రమ భవనాలకు అసెస్‌మెంట్ చేసి వాటికి వార్షిక ట్యాక్స్ ఫిక్స్ చేయాలని మున్సిపల్ కౌన్సిల్ తీర్మానించింది. దీంతో అక్రమంగా నిర్మాణాలు చేపట్టి మున్సిపల్‌కు వార్షికట్యాక్స్ చెల్లిస్తేచాలంటూ కొందరు భావించడం గమనించాల్సిన విషయం.

మా దృష్టికి వస్తే చర్యలు తప్పవు



అక్రమ నిర్మాణాలను ఉపేక్షించ బోము. తమ దృష్టికి వచ్చిన అక్రమ నిర్మాణాలను నోటీసులు ఇచ్చి నిలిపి వేశాం. అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్దంగా నిర్మాణాలు చేపడితే కఠినచర్యలు తప్పవు.

- ఎ.స్వామినాయక్, గుండ్లపోచంపల్లి కమిషనర్

డిల్లెం.. బల్లెం

5వ పేజీ తరువాయి

చిత్రహింసల పాలు చేసే కథనం చెబుతుంటే జనం ఎంతో ఆసక్తిగా వింటూ కన్నీరు పెట్టుకుంటారు.

వేసవి కాలంలో ప్రత్యేకంగా..

రాష్ట్రంలో అనేక కళారూపాలున్నా ఒగ్గు కథకు ఓ ప్రత్యేక స్థానం ఉంది. నేడు గ్రామాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోనూ మల్లన్న, బీరప్ప కామరావతి, శ్రీ రేణుకా ఎల్లమ్మ, మాదాంత కథలు ఎంతో ప్రాచుర్యంలో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా మే, జూన్, జూలై మాసాల్లో బీరప్ప పండగ, మల్లన్న పండగలు ఎంతో ఘనంగా జరుపుకుంటారు. బీరప్ప ఉత్సవాల సందర్భంగా పౌరాణిక, చారిత్రక ఇతిహాసాలు చెబుతూ అందుకు తగ్గట్టుగా డోలు వాయిస్తూ జనాల ఆదరణ పొందడంలో ఒగ్గు కళాకారులు వారికి వారే సాటని చెప్పక తప్పదు. పల్లెల్లో జనం టీవీలకు అతుక్కు పోకుండా ఇంకా జనం ఒగ్గు కథలను ఎంతో ఆసక్తిగా వింటున్నారు. కొంత మంది యువకులు వారసత్వంగా ఒగ్గు కథ చెబుతూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఒగ్గు కథలు చెబుతున్నారంటే చాలు నగరంలో ఉంటున్న వారు సైతం కుటుంబ సభ్యులతో వచ్చి కథలన్నీ విని ఆ తర్వాతే ఇంటి దారి పడుతున్నారంటే అతిశయోక్తి కాదు.

వారంపాటు బీరప్ప పండగ

బీరప్పస్వామి పండగను వారం రోజుల పాటు ఎంతో ఘనంగా జరుపుకుంటున్నారు. బీరప్ప కథలు మొదటి రోజు శుక్రవారం గంగలో (పెద్దబావిలో) స్వామి ఉత్సవ విగ్రహాలు దాచిపెడతారు. రెండో రోజు శనివారం స్వామి వారిని గంగనుంచి ఊరేగింపుగా తెస్తారు. ఆ రాత్రంతా ఒగ్గు కథ చెబుతారు. ఆదివారం సాయంత్రం బీరప్పస్వామి బోనాలు తెస్తారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు స్వామి కల్యాణం, అనంతరం బలి ఉంటుంది.

శ్రీశైలం మల్లన్నతో జమ్మ మల్లారి వివాహం

జమ్మ మల్లారి తన తండ్రి గుండాలు ఉన్నప్పుడే ఆమెకు వివాహం చేయాలని నిర్ణయించారు. ఆ సమయంలో ఆమె తన తండ్రి మాటను సున్నితంగా తిరస్కరించింది. తనకు శ్రీశైల మల్లికార్జున స్వామియే దైవమని ఆ స్వామిని వివాహం చేసుకుంది. ఆమె స్త్రీ అయినప్పటికీ పురుషులు ధరించినట్లుగా చిన్నప్పటి నుంచి ధోవతి కట్టుకుంటుంది. చొక్క, తలపై రుమాలు పెట్టుకుంటుంది. రకరకాల ఒగ్గు కథలు చెబుతూ తోటి కళాకారులకు కూడా ఉపాధి కల్పిస్తుంది. తన తండ్రి గుండాలు మరణిస్తే తన ఇంటి ముందే తండ్రి మృతదేహాన్ని సమాధి చేయించింది. ఆమె పురుషునిలా కనిపించినా ఒగ్గు కథలు చెబుతున్న సమయంలో స్త్రీ వేశం వేసి అందరినీ మెప్పిస్తుంటుంది. ఆమె శివసత్తిలా మారితే అంతా ఆమె చెప్పినట్లుగా నడుచుకుంటారు.



35 ఏళ్లక్రితం బీరప్ప పండగ సమయంలో ఒగ్గుకథ చెబుతున్న జమ్మ మల్లారి (ఫైల్ బ్లాకలర్ చీరలో)

పింఛన్ ఇచ్చి ఆదుకోవాలి



ఒగ్గు కళాకారులకు ప్రభుత్వం పింఛన్లు ఇవ్వాలి. 60 ఏళ్ల పైబడిన ఒగ్గు కళాకారులకు పింఛన్ ఇవ్వడం కోసం తక్షణమే చొరవ తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఒగ్గు కథలు చెప్పించడం కోసం అధికారులు చర్యలు తీసుకోవాలి. అలాగే అందుకు తగిన పారితోషికం అందించాలి. ఇల్లు లేని పేద ఒగ్గు కళాకారులకు ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలి.

- జమ్మ మల్లారి, ఒగ్గు కళాకారిణి, మేడిపల్లి

ఒగ్గుకథ వింటే ఒళ్లు జలదరిస్తది



ఒగ్గు కథ వింటే ఒళ్లంతా జలదరిస్తుంది. వారం రోజుల పాటు బీరప్ప పండగను ఘనంగా జరుపుకుంటాం. నేటికీ కురుమలు కులం కట్టుబాట్లకు, ఇచ్చిన మాటకు విలువ ఇస్తారు. పండగ సందర్భంగా ఇతర కులస్తులకు కూడా విందు ఇస్తాం. కులం పద్ధతిని ప్రతి ఒక్కరూ పాటిస్తారు.

- అచ్చన జంగయ్య, గడ్డమల్లాయగూడ, మాజీ సర్పంచ్

కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నిలబెట్టుకోవాలి



మాట్లాడుతున్న పాలమాకుల జంగయ్య

షాబాద్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. శనివారం షాబాద్‌లో ముదిరాజ్ భవన్‌లో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ముఖ్యంగా రుణమాఫీని అందరికీ వర్తింపజేయాలన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టివ్వాలన్నారు. స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. నియోజకవర్గ కన్వీనర్ రామస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, మండల కార్యదర్శి నక్కలి జంగయ్య నాయకులు రఘురాం, నారాయణ, మధు, రుక్కయ్య, శ్రీశైలం, నర్సయ్య, రాములు, పాండు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

తడబాటు..

- 8 పేజీలతో ఎన్యూమరేటర్ల కుస్తీ
- పలు ప్రశ్నలపై పెదవి విరిచిన జనం
- 6-7 ప్రశ్నలపై చెప్పేందుకు అనాసక్తి

తాండూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆఫీసర్ బేరర్ చేశారా? ఎన్నిటర్మలు చేశారు? నాటినేటెడ్, కార్పొరేషన్, బోర్డు, సహకార సంఘం, ప్రభుత్వేతర సంస్థలో సభ్యులు, సంఘం సభ్యులకు అయితే వివరాలు తెలపండి. మీరు భూమి కలిగి ఉన్నారా? ధరణి పాస్ బుక్ ఉంటే నెంబర్ ఇవ్వండి. మీరు ప్రస్తుతం ఏం పని చేస్తున్నారు. కుల వృత్తి ఏమిటి? గత ఐదు సంవత్సరాలు మీరు ఏమైనా రుణాలు తీసుకున్నారా? తీసుకుంటే ఏ అవసరం నిమిత్తం రుణం తీసుకున్నారు. ఎక్కడి నుంచి రుణం పొందారు? స్థిరాస్తి వివరాలు, చరాస్తి వివరాలు (వాహనాలతో సహా) చెప్పండి. ఇది.. శనివారం ప్రారంభమైన సమగ్ర కుటుంబ సర్వేలో ఇంటింటికి వెళ్లిన ఎన్యుమరేటర్లు అడిగిన ప్రశ్నలు. తాండూరు సెగ్మెంట్‌లో శనివారం సామాజిక, ఆర్థిక విద్య, ఉపాధి, రాజకీయ, కులసర్వే 2024 ప్రారంభమైంది. సర్వేను పరిశీలించగా 8 పేజీల ఫార్మాట్‌తో ప్రజల వద్దకు వెళ్లిన ఎన్యుమరేటర్లను ఇవన్ని వివరాలు ఎందుకు సార్.. ఏం చేస్తారు? అంటూ ప్రశ్నించడం కనిపించింది. ప్రభుత్వం చేయని చెప్పింది.. చేస్తున్నామని కొందరు, మరికొందరు నిజమైన పేదలకు న్యాయం చేయడానికి ఉపయోగపడేలా చేయిస్తున్నారని వివరించారు.



వివరాలు సేకరిస్తున్న ఎన్యూమరేటర్

ఒక ఫారం నింపేందుకు గంట సమయం

సమగ్ర కుటుంబసర్వేలో ఒక్క ఫార్మాట్ నింపడానికి గంటకు పైగా సమయం పడుతోందని, ప్రతీ ప్రశ్నను యజమానిని అడగాల్సిందేనని ఎన్యుమరేటర్లు ఆంధ్రజ్యోతికి వివరించారు. మొదటి రోజు జరిగిన సర్వేలో రిజర్వేషన్ ప్రయోజనాలు, వలసల, స్థిర చరాస్తి వివరాలు, నివాస గృహం యొక్క విస్తీర్ణం చెప్పినప్పుడు ఇంట్లోని గదుల సంఖ్య ఎందుకని వంటి మొదలైన ప్రశ్నలపై ప్రజలు పెదవి విరిచారు. కొందరు ఎన్యుమరేటర్లు ఈ ఫార్మెట్‌ను నింపేందుకు తడబడ్డారు. ఆలస్యంగా ప్రారంభమైన చోట స్టిక్కర్ల ప్రక్రియ తుది దశలో కొనసాగుతుంది. సర్వే సమయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మరోవైపు సర్వే జరుగుతున్న విధానాన్ని అధికార యంత్రాగం క్షేత్రస్థాయిలో పరిశీలించింది.

కోడింగ్‌ను జాగ్రత్తగా నింపాలి



సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

శామీర్‌పేట/యాలాల: నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో నిర్ధేశిత ప్రొఫార్మా నమోదులో కోడింగ్‌ను అత్యంత జాగ్రత్తగా నింపాలని ఎన్యూమరేటర్లను మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. శామీర్‌పేట మండలం అలియాబాద్ గ్రామంలో ఎన్యూమరేటర్లు చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను శనివారం మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ పరిశీలించి మాట్లాడారు. మొదటి రోజు కాబట్టి తప్పులు చూడాలని ఎంపీడీవో మమతాబాయిని ఆదేశించారు. కాగా వికారాబాద్ జిల్లా యాలాలలో సర్వే ఫారాలు అందించేందుకు సాంకేతిక సమస్యలు ఎదురవడంతో ఎంపీడీవో సిబ్బంది, సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు సర్వేఫారాలు మధ్యాహ్నం 1గంట తర్వాత అందజేశారు. ఒక ఎన్యూమరేటర్‌కు కేవలం 16సర్వే ఫారాలు మాత్రమే అందజేశారు. అవసరమైన మాడ్యూల్స్ ఇవ్వకపోవడంతో ఇబ్బందులు తలెత్తాయి.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును పునఃసమీక్షించాలి



సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

ఇబ్రహీంపట్నం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పును పునఃసమీక్షించాలని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ కోరారు. ఈ వర్గీకరణ రాజ్యాంగ బద్ధంగా రావాలని.. మనువాద వర్గీకరణ వద్దని ఆయన అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నంలో జరిగిన మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జాతి నిర్మాణం, హక్కుల కోసం అన్ని వర్గాలు కలిసి పనిచేయాలేగాని ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం మంచిది కాదన్నారు. హక్కుల కోసం మాలలు సంఘటితంగా ఉద్యమించాలని లేదంటే భవిష్యత్తులో మాలలకు తీవ్ర నష్టం జరుగుతుందనే విషయం గుర్తెరగాలన్నారు. రాష్ట్రంలో అన్నిరంగాల్లో మాలలకు జరుగుతున్న అన్యాయంపై ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని గుర్తు చేశారు. త్వరలోనే రాష్ట్రంలో ఓ యూనివర్సిటీకి మాల సామాజికవర్గానికి చెందిన వైస్ చాన్సలర్‌ను నియమిస్తామని కూడా హామీ ఇచ్చినట్లు వివేక్ తెలిపారు. బుద్ధవనం ఓఎస్డీ మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ మోదీ దళిత వ్యతిరేకి అని, మాల, మాదిగలను విడగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారంటూ ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో మాలలు సంఘటితం కావాల్సిన అవసరముందన్నారు. మాలల ఐక్యవేదిక ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కన్వీనర్ లకుమల్ల మారయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సమతా సైనిక్‌దళ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దిగంబర్ కామ్లే, ప్రజా గాయకుడు రెంజర్ల రాజేష్, మాల మహానాడు నాయకుడు చెన్నయ్య, కార్డియాలజిస్ట్ డా.ఎం.ఎస్. గోపీనాథళ్, మాల మహానాడు ఐక్య వేదిక కో-కన్వీనర్లు హనుమండ్ల కిష్టయ్య, డా.అబ్బయ్య, భర్తాకి జగన్, వై.శ్రవణ్‌కుమార్, ఈగల రాములు, ఆవుల మల్లేష్, చిలుకల బుగ్గరాములు, బండి విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి కనబరచాలి



మేడ్చల్ టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సెల్‌ఫోన్లు పక్కనపెట్టి ఫిజికల్ గేమ్స్‌పై ఆసక్తి కనబరచాలని మాజీ మంత్రి, బాల్‌కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ సన్‌ఫ్లవర్ వేదిక్ పాఠశాలలో శనివారం నిర్వహించిన 68వ, వార్షిక రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థులు వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, ఫుట్‌బాల్ వంటి క్రీడలపై దృష్టిసారించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 300మంది క్రీడాకారులు ఈటోర్నమెంట్‌లో పాల్గొనడం ప్రశంసనీయమన్నారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ రాఘవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, టోర్నమెంట్ హోస్ట్ డైరెక్టర్ సరిత కుమారి, ప్రిన్సిపాల్ కల్పన పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

శామీర్‌పేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మేడ్చల్ జిల్లా విద్యాధికారి(డీఈవో) విజయకుమారి అన్నారు. శామీర్‌పేట మండలం తూంకుంటలోని శ్రీవిజ్ఞాన భారతి పాఠశాలలో శనివారం 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) రాష్ట్రస్థాయి టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్-2024-25లో భాగంగా మూడు రోజుల పాటు చెస్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆమె ఎంఈవో వసంతకుమారి, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిష్టయ్య, పాఠశాల కరస్పాండెంట్, ట్రస్మా జిల్లా ఉపాధ్యక్షుడు గోనె హనుమంతరెడ్డిలతో కలసి చెస్ ఆడి క్రీడాపోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో కిష్టయ్య, సత్తిరెడ్డి, గోనె కవిత, మురళీకృష్ణ, ప్రభాకర్, జంగారెడ్డి, హెచ్‌ఎం గోనె సంగీత, వైస్ ప్రిన్సిపాల్ వంశీగౌడ్ పాల్గొన్నారు.

7,771

(5వ పేజీ తరువాయి)

తొలి రోజు కుటుంబాల సమాచారం సేకరణ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. సర్వే ప్రక్రియపై క్యాంప్ కార్యాలయం నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎస్ శాంతికుమారి, ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాలతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టరు లింగ్యానాయక్, సుధీర్‌లతో కలిసి కలెక్టర్ ప్రతీక్‌జైన్ హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడారు. సర్వే కొనసాగుతున్న తీరును సూపర్‌వైజర్లు, మండల ప్రత్యేకాధికారులు పర్యవేక్షించాలని సూచించారు. సర్వే నిర్వహణకు ఒకరోజు ముందు గ్రామాలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. సర్వేపై దుష్ప్రచారం ప్రజలు నమ్మవద్దని, సర్వేపై ప్రజలకు తప్పుడు సమాచారం ఇచ్చే వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో డీపీవో జయసుధ, సీపీవో అశోక్, మునిసిపల్ కమిషనర్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో స్పెషల్ సమ్మర్ రివిజన్ కార్యక్రమం

వికారాబాద్: రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు జిల్లాలో స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శనివారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలో శివారెడ్డిపేట్ గ్రామంలోని 133, 134 పోలింగ్‌స్టేషన్లను సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు లిస్టులో మార్పులు, చేర్పులు తదితర అంశాల కోసం అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు సిద్ధంగా ఉంటారన్నారు. ఓటరు నమోదుకు నేడు బూత్ స్థాయిలో ప్రత్యేక క్యాంప్‌లను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సీఎం ఇకనైనా భాష మార్చుకోవాలి


మాజీ ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తీవ్రంగా ఖండించారు. అసభ్య పదజాలంతో వ్యాఖ్యలు చేయడం రేవంత్‌రెడ్డికి పిచ్చిపనిగా మారిందన్నారు. ఆయన భాష గీత దాటిపోతుందన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి మాటలకు స్థానంలేదని మార్పు కోసం ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందన్నారు. సీఎం వ్యాఖ్యలతో ప్రజలు సైతం విరక్తి చెందుతున్నారని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో హుందాతనాన్ని ప్రజలు కోరుకుంటారని, ఇలాంటి తిట్లు కొంతమందికి తాత్కాలికంగా సంతోషాన్నిచ్చినప్పటికీ, దీర్ఘకాలంలో రాష్ట్ర ప్రయోజనాలు, ప్రతిష్ఠ దెబ్బతింటాయని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఇప్పటికైనా మీ భాష మార్చుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

430 ఎకరాల సాగుకు తీర్మానం

దోమ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయినాపూర్ గ్రామ పెద్ద చెరువును శనివారం డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు పరిశీలించారు. యాసంగి సీజన్‌లో 430 ఎకరాలు సాగు అవుతుందని గ్రామస్థుల సమక్షంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సుదర్శన్, సత్యనారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వీపింగ్.. స్లీపింగ్!

- మూడేళ్ల క్రితం రూ.38 లక్షలతో కొనుగోలు
- అప్పటి నుంచే నిరుపయోగం


నూతన మున్సిపల్ భవనం ఎదుట నిరుపయోగంగా ఉన్న స్వీపింగ్ మిషన్

తాండూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీలో రోడ్లు ఊడ్చేందుకు రూ.38లక్షల విలువైన స్వీపింగ్ యంత్రాన్ని కొనుగోలు చేసి దాదాపు మూడు సంవత్సరాలు పూర్తయింది. అయితే ఈ యంత్రాన్ని ఉపయోగంలోకి తీసుకురాకపోగా కొత్త మున్సిపల్ భవనం ఎదుట నిరుపయోగంగా పెట్టేశారు. 2019 నవంబరు 29వ తేదీన ప్రత్యేక అధికారి పాలనలో చేసిన తీర్మానాన్ని ఆసరాగా చేసుకుని 14వ ఆర్థిక సంఘం నిధులతో స్వీపింగ్ యంత్రాన్ని కొనుగోలు చేశారు. కార్పొరేషన్‌లో ఉపయోగించే ఈస్వీపింగ్ మిషన్ తాండూరు మున్సిపాలిటీలో మెయిన్ రోడ్లు క్లీనింగ్ కోసం కొనుగోలు చేశారు. కమీషన్లకు కక్కుర్తి పడి లక్షలు పోసి కొనుగోలు చేసిన మిషన్‌ను మూలనపడేశారు.

హడావుడిగా తీర్మానం

పట్టణంలో రోడ్ల పరిస్థితి పూర్తిగా అధ్యయనం చేసి, అవసరం మేరకు కొనుగోలు చేయాల్సిన స్వీపింగ్ మిషన్ హడావుడిగా తీర్మానం చేసి ఆగమేఘాల మీద కొనుగోలు చేశారు. ఇప్పటికే పట్టణంలో పారిశుధ్య కార్మికులు 260మంది వరకు ఉన్నారు. ప్రజాపన్నుల ద్వారా వసూలైన నిధులతో కొనుగోలు చేసిన స్వీపింగ్ మిషన్ నిర్ణయాన్ని అపట్లో విపక్ష కౌన్సిలర్లు వ్యతిరేకించారు. 14వ ఆర్థిక సంఘం నిధులు రోడ్లపనులు చేసిన కాంట్రాక్టర్ బిల్లుల చెల్లింపులకే సరిపోనుండగా, ఏకంగా ఆనిధులను దారి మళ్లించి స్వీపింగ్ మిషన్ కొనుగోలు చేయించారు. ఈమిషన్ కొనుగోళ్లు, టెండర్ల విషయం మున్సిపల్ ఉన్నతాధికారుల ఒత్తిళ్ల మేరకే జరిగిందన్న విమర్శలున్నాయి.

దిష్టిబొమ్మలా ఉంచడంపై విమర్శలు

తాండూరుకు అనేక మంది కమిషనర్లు మారినప్పటికీ స్విపింగ్ మిషన్ గురించి పట్టించుకోవడం లేదు. మున్సిపాలిటీ ఎదుటే అట్టి మిషన్‌ను ప్రదర్శన కోసం పెట్టిన ఒక దిష్టిబొమ్మలా ఉంచడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలో ఉన్న రోడ్లన్నీ గుంతల మయంగా ఉండటం, ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్నరోడ్లు మున్సిపల్ పరిధిలోకి ఇంకా తీసుకురాకపోవడం, మెయిన్ రోడ్లలో చాలా చోట్ల సీసీలు, బీటీరోడ్లు లేకపోవడంతో ఈ మిషన్‌ను వాడటంలేదని అధికారులు చెబుతున్నారు.

యువత ఓటు నమోదు చేసుకోవాలి


కొడంగల్: ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కొడంగల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం కొడంగల్‌లో ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. నూతన ఓటర్ల నమోదుకు శని, ఆదివారాల్లో నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌లలో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

దోమ: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని బాసుపల్లి గ్రామంలో ఓటరు నమోదును ఎంపీడీవో మహేశ్‌బాబు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకట్‌నాయక్, కార్యదర్శి రవి పాల్గొన్నారు.

మర్పల్లి: మండలంలోని పట్లూర్ గ్రామ పంచాయతీలో శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ మునిరోద్దీన్ పరిశీలించారు.

బషీరాబాద్: మండల కేంద్రంలో ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాన్ని బషీరాబాద్ తహసీల్దార్ వై. వెంకటేష్ శనివారం తనిఖీ చేశారు. అనంతరం తహసీల్దార్ బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు.

ధారూరు: మండల పరిధిలోని కుక్కిందలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు ప్రత్యేక కేంద్రాన్ని శనివారం మండల త హసీల్దార్ సాజిదాబేగం తనిఖీ చేశారు. మండలంలోని 47 పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాల్లో కొత్త ఓటర్లుగా నమోదు కోసం 23 మంది దరఖాస్తు చేసుకున్నారని, 21మంది ఓటును తొలగించాలని ఫారం-7ను బీఎల్‌వోలకు అందజేశారు.

మోమిన్‌పేట్: ప్రత్యేక ఓటరు నమోదులో భాగంగా శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమంలో 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్‌ఐ గోవర్ధన్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.

బీటీ వేశారు.. స్తంభాలు తీయడం మరిచారు

(5వ పేజీ తరువాయి)

సమన్వయంతో రోడ్డుపై కల్వర్టులు, చిన్న వంతెనల నిర్మాణం, పైపులైన్ల ఏర్పాట్లు పూర్తి చేశారు. కానీ ఎదులాబాద్, కొర్రెముల సమీపంలో రోడ్డుపై ఉన్న స్తంభాలను తీయడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరిగి వాహనాదారులు చనిపోతున్నారు. ఈ రోడ్డు పూర్తిస్థాయిలో వినియోగంలోకి వస్తే ఎదులాబాద్ తదితర ప్రాంతాల వాహనాదారులు నగరానికి వెళ్లడానికి పది కిలోమీటర్ల అదనపు దూరం తగ్గనుంది. ఎదులాబాద్ నుంచి కొర్రెముల మీదుగా నేరుగా నారపల్లి వద్ద వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారికి చేరుకోవచ్చు. అయితే పనులు నత్తనడకన సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనాదారులు వాపోతున్నారు. ఇప్పటికైన రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



నారపల్లి-ఎదులాబాద్ మార్గంలో విద్యుత్ స్తంభాలు రోడ్డు మధ్యలోనే ఉన్నాయి. రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈరోడ్డు మార్గంలో నగరానికి వెళ్తితే పది కిలో మీటర్లు దూరం తగ్గుతుంది. అందుకే వాహనాదారులు ఎక్కువగా ఈ రోడ్డు మార్గంలో వెళ్లుతున్నారు. ఇప్పటికైన అధికారులు విద్యుత్ స్తంభాలను తొలగించాలి.

\- వర్నాల పరమేష్, స్థానికుడు ఎదులాబాద్

అధికారుల సమన్వయ లోపం



మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం నారపల్లి-ఎదులాబాద్ రోడ్డుకు రూ.15కోట్లు మంజూరు చేసింది. రోడ్డు పనులు ప్రారంభమై రెండేళ్లు గడుస్తున్న పూర్తి కావడంలేదు. గుత్తెదారుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రమాదాలు జరిగి అమాయకుల ప్రాణాలు పోతున్నాయి. రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలి.

\- చలువాది ప్రవీణ్‌రావు, బీజేపీ మండల అధ్యక్షుడు

క్రైం కార్నర్

వివాహ వేడుకలో అపశృతి

- విద్యుదాఘాతానికి గురై బాలుడు మృతి

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వివాహ వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. విద్యుదాఘాతానికి గురై ఓ బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోచారం మున్సిపాలిటీ, యంనంపేట్ ఈడబ్ల్యుఎస్ కాలనికి చెందిన మీసాల నర్సింహా కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం రాత్రి 11.30లకు అదే కాలనీలో అతడి పెద్దనాన్న కోడుకు మీసాల శ్రీశైలం విందుకు హాజరయ్యారు. నర్సింహా కుమారుడు మీసాల కేతన్‌రాం(10) విందు కార్యక్రమంలో ఏర్పాటు చేసిన లైటింగ్‌ను పట్టుకోవడంతో విద్యుత్ షాక్ తగిలింది. దీంతో బాలుడిని చికిత్స నిమిత్తం ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో వివాహవేడుకల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. విందు కార్యక్రమంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేసిన కేతావత్ వినోద్‌నాయక్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ కూలీ మృతి

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ కూలీ మృతిచెందాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. చత్తీస్‌గఢ్‌కు చెందిన ఆస్మాన్ బగేల్(20) ఎదులాబాద్‌కు చెందిన బాత్క కిష్టయ్య వద్ద ప్యారగడ్డి కోయడానికి కూలీగా చేరాడు. ఎదులాబాద్ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం ప్యార గడ్డి కోసి అశోక్ లేల్యాండ్‌లోకి ఎక్కిస్తుండగా ఓ కారు అతివేగంగా వచ్చి ఆస్మాన్ బగేల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆస్మాన్ బగేల్‌కు తీవ్రగాయాలు కావడంతో మేడిపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఆస్మాన్ మృతికి కారణమైన కారుడ్రైవర్ పెద్దఅంబర్‌పేట్‌కు చెందిన భరత్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి..

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం. పోచారం మున్సిపాలిటీ, ఎమ్రాల్డ్ పార్కు సమీపంలో ఈ నెల 5న (45-50)వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి ఫిట్స్‌తో బాధపడుతున్నాడని గమనించిన స్థానికులు 108 వాహనసిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అక్కడి కి చేరుకున్న 108 సిబ్బంది చికిత్స నిమిత్తం ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను శనివారం సాయంత్రం మృతి చెందినట్లు వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళ అదృశ్యం


కొంపల్లి జ్యోతి

పూడూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కూలీపనుల నిమిత్తం వచ్చిన మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన పుడుగుర్తిలో చోటుచేసుకుంది. చెన్‌గోముల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అత్తెల్లికి చెందిన కొంపల్లి జ్యోతి(35సంవత్సరాలు) పుడుగుర్తిలో ఉంటున్న తన అక్క చింతకుంట లక్ష్మమ్మ పొలంలో మక్కలు కోసేందుకు కూలీపని నిమిత్తం 15రోజుల క్రితం వచ్చింది. రోజూ మాదిరిగా ఈనెల 3వ తేదీన రాత్రి అందరూ నిద్రించగా తెల్లవారు జామున 4.30గంటల ప్రాంతంలో లక్ష్మమ్మకు మెలుకువ వచ్చింది. ఆమె పక్కనే నిద్రించిన జ్యోతి కనిపించలేదు. ఆమె కోసం ఎక్కడ వెతికినా కనిపించలేదు. ఫోన్‌చేస్తే స్విచ్‌ఆఫ్ వచ్చింది. దీంతో లక్ష్మమ్మ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎవరికైనా కనిపిస్తే సెల్ 8712670042 నెంబర్‌కు సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి


పరిగి(గడిసింగాపూర్‌లో కులగణన సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో కరీం

కొడంగల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కుల గణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో ఉషశ్రీ, తహసీల్దార్ విజయ్‌కుమార్ ఎన్యూమరేటర్‌లకు సూచించారు. కొడంగల్ మండలంలోని హుసేన్‌పూర్‌లో శనివారం ఎన్యూమరేటర్లు నిర్వహిస్తున్న సర్వేను వారు పరిశీలించారు. సర్వేలో కుటుంబాల వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్. ప్రశాంత్, సంజీవరెడ్డి, ఎన్యూమరేటర్‌లు పాల్గొన్నారు.

మర్పల్లి: ప్రతీ ఇంటికి వెళ్లి తప్పనిసరిగా కుటుంబాల వివరాలను సేకరించాలని ఎంపీడీవో రాజమల్లయ్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్యూమరేటర్‌లకు శనివారం సర్వే ఫారాలు అందజేశారు.

దోమ: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శనివారం కుల గణన సర్వేను ఎన్యూమరేటర్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మహేశ్‌బాబు మాట్లాడుతూ సర్వేలో ఎన్యూమరేటర్‌లు కుటుంబ సభ్యుల వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉదన్‌రావుపల్లి పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండలంలోని ఎన్కతల గ్రామంలో నిర్వహించిన సర్వేలో ఎన్యూమరేటర్ రమేశ్ పంచాయతీ కార్యదర్శి నర్సింహులుతో కలిసి కుటుంబ సభ్యుల వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీరాములు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: తాండూరు మండలంలో ప్రారంభమైన సర్వేను ఎంపీడీవో విశ్వప్రసాద్ పర్యవేక్షించారు. శనివారం మండలంలోని గౌతాపూర్‌లో సర్వేను పరిశీలించిన ఆయన ఎన్యూమరేటర్లు ఏ విధంగా సర్వే వివరాలు సేకరిస్తున్నారనే దానిపై పరిశీలించి పలు సూచనలు చేశారు.

పరిగి: మునిసిపల్ పరిధిలోని 5 వార్డులో, మండల పరిధిలోని గడిసింగాపూర్ తదితర గ్రామాల్లో మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, కమిషనర్ వెంకటయ్య, ఎంపీడీవో ఎంఏ కరీంలు వేర్వేరుగా సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు దశరథ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బంట్వారం(కోట్‌పల్లి): కుటుంబ సర్వే శనివారం నుంచి కోట్‌పల్లి, బంట్వారం మండలాల్లోని గ్రామాల్లోని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలి పారు. ఈ సర్వేకు గ్రామాలో ఉన్న ప్రతీ కుటుంబం సహకరించి తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయించాలని కోరారు.


వికారాబాద్: ప్రభుత్వ కుల గణన సర్వేలో కుర్మ సమాజం సభ్యులు తమ కులాన్ని కురుమ(గొల్లకురుమ)బీసీ-బి సీరియల్ నెం.11గా నమోదు చేయించుకోవాలని కురుమ సంఘం పట్టణ అధ్యక్షుడు కృష్ణ సూచించారు. 2014 సర్వేలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

ట్రెయినీ కలెక్టర్ వివాహానికి ఎమ్మెల్యే హాజరు


వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ జిల్లా ట్రైని కలెక్టర్ ఉమా హారతి వివాహం శుక్రవారం హైదరాబాద్ నగరంలో జరిగింది. ఈ వివాహ వేడుకలకు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హజరై వధూవరులను ఆశీర్వదించారు.

పారిశుధ్య కార్మికులకు అఫ్రాన్ల పంపిణీ


అఫ్రాన్‌లు అందజేస్తున్న శంకర్‌నాయక్

బషీరాబాద్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులకు తాండూరు డివిజనల్ పంచాయతీ అధికారి శంకర్‌నాయక్ శనివారం అఫ్రాన్ల(ఉప వస్త్రం)ను అందజేశారు. బషీరాబాద్‌లోని పలు వార్డుల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను స్థానిక పంచాయతీ కార్యదర్శి జయకార్‌తో కలిసి వెళ్లి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులకు పలు సూచనలు చేశారు. అనంతరం అక్కడే కార్మికులకు అఫ్రాన్లను పంపిణీ చేశారు.

ప్రాథమిక దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

పరిగి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మండల లీగల్ సర్వీసు కౌన్సిల్ న్యాయవాది ఎండీ గౌస్‌పాషా అన్నారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా శనివారం పరిగి ఎస్సీ బాలుర వసతి గృహంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. న్యాయ వ్యవస్థలో అందరికి సమాన న్యాయం పొందే హక్కు ఉందన్నారు. చట్టాల గురించి తెలుసుకుంటే నేరాలకు దూరంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో కోర్టు ఉద్యోగులు అనిల్‌కుమార్, మోహన్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి


దివ్యాంగులకు వీల్‌చైర్‌లను అందజేస్తున్న వజ్రేష్ యాదవ్

ఘట్‌కేసర్, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ దివ్యాంగుల కాలనీలో శనివారం శ్రీకృష్ణ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దివ్యాంగులకు ఉచితంగా వీల్‌చైర్లను అందజేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ శ్రీకృష్ణ యూత్‌ను స్థాపించి వివిద సేవా కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సయ్యద్ గౌస్, రాజు, సునీల్, విశ్వనాథ్, గిరిబాబు, బాల్‌రాజ్, బాలకృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరూ సేవా దృక్పథంతో మెలగాలి

మోమిన్‌పేట్: సమాజంలో ప్రతీ ఒక్కరూ సేవా దృక్పథంతో మెలగాలని మోమిన్‌పేట్ సొసైటీ చైర్మన్ బి.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని దివ్యాంగులు టేకులపల్లి గ్రామానికి కొండగల్ల మానెయ్య, సుద్దోడక తండాకు చెందిన రామవత్ కుమార్‌కు శనివారం ట్రై సైకిళ్లను అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ రైస్, నాయకులు మోహన్‌రెడ్డి, మాణిక్యం, శ్రీనివాస్, ఫక్రుద్దీన్, గౌస్, రమేశ్‌కుమార్, శ్రీనివాస్, రాజేందర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల్లో గర్భకోశ వ్యాధులకు చికిత్స


పశువులకు చికిత్స చేస్తున్న పశు వైద్యఅధికారులు

బంట్వారం(కోట్‌పల్లి), నవంబరు 9 (ఆంధ్ర జ్యోతి): కోట్‌పల్లి మండలంలోని అన్నసాగర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర పశుగణన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువుల్లో గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించినట్లు పశువైద్యాధికారి డాక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు. దీర్ఘకాలికంగా ఎదకు రాని పశువులను గుర్తించి తగిన చికిత్స అందించినట్లు చెప్పారు. 34 గేదెలకు గర్భ నిర్ధారణ పరీక్షలు, 58 ఆవులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేసినట్లు తెలిపారు. 62 లేగలకు నట్టల నివారణ మందులు తాగించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ అధికారి నర్సింహులు, గోపాల మిత్రలు బందయ్య, నరేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్ష ఎన్నిక సరికాదు

బొంరాస్‌పేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూర్ గ్రామ మహిళా సంఘాల మహిళలను, దళిత ప్రజాసంఘాల నాయకులను మోసం చేసి ఏకగ్రీవంగా సంఘాన్ని ఎన్నుకోవడం సరైంది కాదని ప్రజాసంఘాల నాయకులు బుస్స చంద్రయ్య, చంద్రయ్య, రమేశ్‌బాబు, దస్తప్ప ఆరోపించారు. వారు శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఏకపక్షంగా ఎన్నిక నిర్వహించిన మహిళా సంఘం సీసీ సునీత, కొత్తూర్ బుక్ కీపర్ ఎల్లప్పగౌడ్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలి

ఘట్‌కేసర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలో విలీనమైన ఆయా పంచాయతీ సిబ్బందికి శనివారం చౌదరిగూడలో జరిగిన కార్యక్రమంలో గ్లౌజులు, పంజాలు, చీపుర్లు, మాస్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వీరారెడ్డి పాల్గొన్నారు.

రెడ్డిలపై నోరుపారేసుకుంటే సహించం

ఘట్‌కేసర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొంత కాలంగా రెడ్డి కులస్థులపై అనుచిత వాఖ్యలు చేస్తున్న చింతపంటి నవీన్ (తీన్మార్‌మల్లన్న)తీరు మార్చుకోవాలని రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు కట్ట జనార్దన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లోని రెడ్డిసంఘం కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెడ్డి కులస్థులపై నవీన్ మతిభ్రమించి మాట్లాడుతున్నాడని ఆరోపించారు. ఇటీవల మల్లన్న మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకొని రెడ్డి కులస్తులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మరో సారి ఇలాంటి మాటలు మాట్లాడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పెద్దేముల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెద్దేముల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1994-95లో చదువుకున్న విద్యార్థులు శనివారం ఒకేచోట చేరారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. వారికి చదువుచెప్పిన గురువులను ఆత్మీయంగా సన్మానించుకున్నారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో గడిపారు. 30 సంవత్సరాల తరువాత ఇలా కలుసుకుంటామని కలలో కూడా అనుకోలేదని సంతోషం వ్యక్తం చేశారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మూడుచింతలపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతీ పనిలోనూ నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని జగ్గంగూడ, లక్ష్మాపూర్, మూడుచింతలపల్లి గ్రామాల్లో శనివారం అకస్మికంగా పర్యటించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావల్సిన సదుపాయాలు కల్పించాలన్నారు. అదేవిధంగా మండలంలో నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించడంతో పాటు జగ్గంగూడలో కొనసాగుతున్న ఇంటింటి సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నాగజ్యోతి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దోమ: ప్రభుత్వ మద్దతు ధర వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఉపసర్పంచ్ కరణం శ్రీకాంత్ తెలిపారు. మోత్కుర్‌లో శనివారం ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, సంఘం సభ్యులు, పీఏసీఎస్ డైరెక్టర్లు, రైతులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్పకొండపై నిత్యపూజలు


వేటతుల్లి ఆడుతున్న అయ్యప్పస్వాములు

కులకచర్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండల కేంద్రంలోని అయ్యప్ప కొండపై నిత్య పూజలు కొనసాగుతున్నాయి. శనివారం అయ్యప్ప భక్తులు వేట తుల్లి ఆడారు. గురుస్వాములు ఈశ్వరయ్య, చంద్రశేఖర్, అంజిగౌడ్ ఆధ్వర్యంలో స్వాములు పూజ అనంతరం వేటతుల్లి కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతీ సంవత్సరం భక్తులు మాలధరించి శబరిమాల వెళ్లి అయ్యప్పస్వామిని దర్శించుకుంటారు. ప్రతీ సంవత్సరం డిసెంబర్ 18న అయ్యప్ప కొండపై మహాపడి పూజ నిర్వహించనున్నారు.